
సాక్షి ఒడిశా

బుధవారం । 30 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 3,68,594

బంగారం 23 గ్రాముల 950 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

ప్రఫుల్ల సామంతరాయ్ అపహరణ..?



లోక్‌శక్తి అభియాన్ జాతీయ ముఖ్య సలహాదారుడు, స్వాభిమాన్ పత్రిక సంపాదకుడు ప్రఫుల్ల సామంతరాయిని గుర్తు తెలియని కొందరు అపహరించారనే వదంతులు వినిపిస్తున్నాయి. సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం ఆయన రాయగడ వచ్చారు.

- 8లో

రాష్ట్రానికి ఈసీఐ బృందం



సెప్టెంబర్ 13న భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బృందం రాష్ట్ర పర్యటనకు విచ్చేయనుంది. ఈ బృందం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమవుతుంది.

- 8లో

న్యూస్‌రీల్

నెక్కంటికి మాతృ వియోగం



నెక్కంటి రమారత్నం(ఫైల్)

రాయగడ: రాజ్యసభ మాజీ ఎంపీ, అధికార బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి రమారత్నం (96) మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో విశాఖపట్నంలోని వారి స్వగృహంలో తుది శ్వాస విడిచారు. దీంతో నెక్కంటి అభిమానులు, పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల వ్యాపార సంస్థల ప్రతినిధులు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాయగడ నుంచి ఇప్పటికే పలువురు విశాఖపట్నం చేరుకొని నివాళులర్పించారు.

చిన్నారి మృతదేహం లభ్యం

- మరొకరి కోసం గాలింపు



రత్నాకర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో ఉన్నటువంటి ప్రముఖ శైవక్షేత్రం మీనాజోలలో ఉన్న మీనకేశ్వరుని దర్శనం కోసం వచ్చి వంశధార నదిలో గల్లంతైన ఇద్దరు చిన్నారుల్లో ఒకరి మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది గుర్తించగలిగారు. కందమాల్ జిల్లాలోని కొటాగుడ సమితి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన రత్నాకర్ బొడొనాయక్ (9), స్మృతి బడసేట్ (10)అనే ఇద్దరు చిన్నారులు సోమవారం నది ప్రవాహంలో కొట్టుకుపోయిన సంగతి పాఠకులకు తెలిసిందే. మంగళవారం ఇద్దరిలో రత్నాకర్ మృతదేహాన్ని సంఘటన స్థలానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి పాలకపాదొరొ సమీపంలో సిబ్బంది గుర్తించారు. మరో చిన్నారి స్మృతి ఆచూకీ ఇంకా లభించలేదు.

ఇద్దరు నిందితులు అరెస్టు



నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: ఒక దొంగతనం కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను టికిరి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. టికిరి ఐఐసీ విశ్వచందనా బాగ్ తెలిపిన వివరాల మేరకు.. రైల్వే విభాగంలో పనిచేస్తున్న రోషన్ కుమార్ ప్రసాద్ ఆగస్టు 22వ తేదీన టికిరి నుంచి పని మీద రాయగడకు వచ్చారు. అనంతరం 27వ తేదీన తన ఇంటికి వచ్చి చూడగా దొంగలు ఇంటి తలుపులు విరగొట్టి ల్యాప్‌టాప్, ఒక ఐఫోన్‌ను దొంగిలించారు. దీంతో బాధితుడు అదేరోజు టికిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు కొనసాగించిన పోలీసులు చోరీ సొత్తును ఖరీదు చేసిన సంతోష్, హేమంత్‌లను అరెస్టు చేశారు. అయితే అసలు దొంగతనం చేసిన వారి గురించి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. నిందితులను మంగళవారం కోర్టుకు తరలించారు.

120 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టు చేసిన వ్యక్తులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 120 కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి బీరేంద్ర కుమార్ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో నగర శివారులోని ఫస్ట్‌గేట్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానంతో ఒక కారులో సోదాలు నిర్వహించగా, 120 కిలోల గంజాయి బయటపడింది. దీంతో కారులో ఉన్నటువంటి ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైనవారు మహారాష్ట్రకి చెందిన హుమాస్ మహబత్, సాహిద్ సకీల్‌లుగా గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని ఖరీదు చేస్తుందని ఐఐసీ తెలియజేశారు.

అధ్యయనం చేస్తూ... అనుభవం సాధిస్తూ..!

పసుపు పంటలను పరిశీలిస్తున్న దృశ్యం





డీకేడీఏ అధికారులతో చర్చిస్తున్న బృందం సభ్యులు

శాలువలను పరిశీలిస్తున్న అధికారులు



- 14 మంది సివిల్స్ ప్రొబేషన్ అధికారుల విస్తృత పర్యటన
- ఆదివాసీ ప్రజలతో మమేకం
- సమస్యలు తెలుసుకుంటూ సాగుతున్న వైనం

రాయగడ: ఢిల్లీలోని ముసురీర్ లాల్ బహదూర్ శాస్త్రి అకాడమీలో ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న 14 మంది ప్రొబేషనరీ అధికారులు జిల్లాలో గత రెండు రోజులుగా పర్యటిస్తున్నారు. డొంగిరియా, లంజియా సవర తెగలు నివసిస్తున్న పుటాసింగి, కుర్లి, కంభేషు తదితర ప్రాంతాల్లో తిరుగుతూ వారి జీవన స్థితిగతులను అధ్యయనం చేస్తున్నారు. బిసంకటక్ సమితి చాటికొన పంచాయతీలోని కాంభేషు, కుర్లి ప్రాంతాల్లో డొంగిరియా తెగలు నివసిస్తున్న గ్రామాల్లో ఆర్థిక నాయర్, ఎంవీ మనీష్, దివ్యా పంత్, వైశాలి, గౌరవ్ గంగాధర్, మనస్ అగ్రవాల్‌లు పర్యటిస్తుండగా, గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో లంజియా సవర తెగకు చెందిన ప్రజలు నివసిస్తున్న పుటాసింగి ప్రాంతంలో పల్లవీ శుంకరి, స్వాతి సమీర్, రుతు మీనా, అవినాష్ పద్మన్ తమిడి, ఆశాద్ జుబేరి, బి.సిద్దార్థ్ కిషోర్, జయంతీ చరణ్‌లు పర్యటిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో అధికారులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం బృందం సభ్యులు డొంగిరియాలు నివసిస్తున్న ప్రతి ఇంటికీ వెళ్లి ముచ్చటించారు. వారు నివసిస్తున్న జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ



కుర్లి గ్రామంలో అధికారులకు స్వాగతం పలుకుతున్న డొంగిరియా మహిళలు

పథకాలు సకాలంలో అందుతున్నాయో లేదో ఆరా తీశారు. జీవనోపాధి గురించి డొంగిరియాలు అవలంభిస్తున్న ఉపాధి మార్గాలను అడిగి తెలుసుకున్నారు. అత్యధిక శాతం మంది డొంగిరియాలు పర్వత ప్రాంతాల్లో పండించే పైనాపిల్, పసుపు తదితర పంటలపై ఆధారపడి జీవిస్తున్నట్లు గమనించిన అధికారులు, అందుకు ప్రభుత్వం ప్రోత్సాహిస్తున్న తీరును తెలుసుకున్నారు.

సంప్రదాయ శాలువాలు

డొంగిరాయాల భాషా, సంస్కృతికి అద్దంపట్టే శాలువాలను చూసిన అధికారులు వారితో కాసేపు ముచ్చటించారు. రాష్ట్రేతర ప్రాంతాల్లో మంచి గుర్తింపు కలిగిన ఈ శాలువాల అల్లికకు సంబంధించి మహిళలతో మాట్లాడారు. అల్లికలో ఎంతో అందాన్ని సంతరించుకున్న శాలువాను చూసిన మహిళా అధికారులు ముచ్చటపడ్డారు. వారి నుంచి కొనుగోలు చేశారు.



ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న దృశ్యం



డొంగిరియాలతో అధికారుల బృందం సభ్యులు

అధికారులతో చర్చలు

డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా ఉన్న డీకేడీఏ (డొంగిరియా కొందో డవలప్‌మెంట్ ఏజెన్సీ) అధికారి సుదర్శన్ పాఢి, తదితర సిబ్బందితో బృందం సభ్యులు చర్చించారు. వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధి కొసం సంస్థ ఎంతో కృషి చేస్తోందని పాఢి వివరించారు. శాలువాల తయారీ, మార్కెటింగ్‌కు సంబంధించి సంస్థ అందిస్తున్న చేయూతను గురించి వివరించారు. అదేవిధంగా డొంగిరియాలు నివసిస్తున్న గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, వ్యవసాయాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వంటివి బృందంకు తెలియజేశారు. అనంతరం ప్రజలతో బృందం సభ్యులు సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. మరో రెండు రోజులు ఈ బృందం సభ్యులు పర్యటిస్తారు.

రక్షా బంధన్‌కు సన్నాహాలు



జగన్నాథుని రాఖీల తయారీలో పాత్రా బిషోయ్ సేవకులు



దేవుళ్ల కోసం సిద్ధమవుతున్న రాఖీలు

- మూల విరాటులకు రాఖీలు సిద్ధం
- వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

భువనేశ్వర్: పవిత్ర రక్షా బంధన్ ఉత్సవం నిర్వహణకు చురుకుగా సన్నాహాలు చేస్తున్నారు. శ్రీమందిరం రత్న వేదికపై ఆశీనులైన మూల విరాటుల కోసం రాఖీలు తయారవుతున్నాయి. ఏటా గహ్మ పూర్ణిమ పురస్కరించుకుని శ్రీజగన్నాథుని సన్నిధిలో ఈ ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. మానవీయ స్వభావి శ్రీజగన్నాథుడు ఉత్సవప్రియుడు. రాఖీ పూర్ణిమ పురస్కరించుకుని సోదరి దేవీ సుభద్ర రత్న వేదికపై ఆశీనులైన సోదరులు బలభద్రుడు, జగన్నాథునికి రాఖీలతో రక్షా బంధనం చేస్తుంది.

ప్రత్యేక శైలిలో...

పాత్రా బిషోయ్ సేవకులు మూల విరాటుల కోసం ప్రత్యేక శైలిలో రాఖీలు తయారు చేస్తున్నారు. భగవంతుని రాఖీల తయారీ తుది మెరుగులు దిద్దుకుంటున్నట్లు తెలిపారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జగన్నాథునికి రెండు, బలభద్రుడికి రెండు చొప్పున 4 రాఖీలు సిద్ధమవుతున్నాయి. మహాప్రభువు జగన్నాథునికి ఎరుపు, పసుపు రంగుల్లో, బలభద్ర స్వామి కోసం ఆకుపచ్చ, ఊదా రంగుల్లో రాఖీలు తయారవుతున్నాయి. ఈ మాలల తయారీలో తొక్క వలిచిన వక్కల్ని 54 చొప్పున వినియోగిస్తారు.

అంతా సంప్రదాయమే

ఆలయ సంప్రదాయం ప్రకారం ఏటా చిత్తా అమావాస్య 10 రోజుల తర్వాత రాఖీ తయారీ ప్రారంభమవుతుంది. పాత్రా బిషోయ్ కుటుంబం రాఖీని తయారు చేయడంలో నిమగ్నం అవుతారు. 10 నుంచి 12 రోజులు నిర్విరామంగా ఇంటిల్లిపాది కలిసిమెలిసి స్వామివారి కోసం రాఖీలు తయారు చేస్తారు. సంప్రదాయబద్ధంగా అత్యంత నియమ నిష్టలతో పాలుపంచుకుంటారు. వీటి తయారీ కోసం దేవస్థానం పట్టు పోగులు సమకూర్చుతుంది. మూల విరాటుల అలంకరణకు అనుగుణంగా ఈ పోగులను రంగుల్లో ముంచి ఆకర్షణీయంగా మలుచుతారు.

అంచనా ప్రకారమే

రాఖీకి కొలమానం లేదు. బలభద్ర మరియు మహాప్రభు జగన్నాథుని చేతులతో సుమారుగా సరిపడే అంచనా కొలతలతో తయారు చేయడం విశేషం. రత్న వేదికపై ఇద్దరు మూల విరాటులతో పాటు పార్శ్వ దేవుళ్లకు సైతం రాఖీలు అలంకరిస్తారు. ఈ నేపథ్యంలో నవగ్రహ మరియు పార్శ్వ దేవుళ్ల కోసం 20 పైబడి చిన్న రాఖీలను సిద్ధం చేస్తారు. వీటిని గహ్మ పూర్ణిమ నాడు మహాప్రభుతో పాటు అలంకరించి పూజిస్తారు.

మధ్యాహ్న ధూపం తర్వాత

రాఖీ పూర్ణిమ నాడు మధ్యాహ్న ధూపం తర్వాత రక్షా బంధనం నిర్వహిస్తారు. అంతకుముందే ఉదయం వేళలో పాత్రా బిషోయ్ సేవకులు తయారు చేసిన పట్టు పోగుల రాఖీలు శ్రీ మందిరం చేరుతాయి. బలభద్ర స్వామి, జగన్నాథుడు రెండు చేతులకు ఒక్కో రాఖీ చొప్పున అలంకరించుకుంటారు. దేవస్థానం ఆమోదం పొందిన పాత్రా బిషోయ్ జగన్నాథ్ పాత్రో ఈ ప్రక్రియ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు.

ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కొందాం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా

బరంపురం: రానున్న రోజుల్లో వచ్చే ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కొనేందుకు అందరూ చైతన్యవంతులు కావాలని కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రకృతి వైపరీత్యాలపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫైలిన్, హుద్‌హుద్, తితిలీ వంటి తుఫాన్‌ల అనంతరం ఐఎండీ గంజాం జిల్లాను సైక్లోన్ జోన్‌గా గుర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల తరచుగా తుఫాన్లు ఈ ప్రాంతంలోనే తీరం దాటుతున్నాయని పేర్కొన్నారు. అందువలన ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు అందరూ శిక్షణతో సంసిద్ధులు కావాలని సూచించారు. అనంతరం విపత్తు కారణంగా పిల్లలకు వచ్చే వ్యాధ్యులు ఎలా ఎదుర్కోవాలో అంగన్‌వాడీ మరియు ఆశా మహిళల ద్వారా చైతన్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా వరదలు వచ్చే సమయంలో ఎలా ఎదుర్కోవాలో అగ్నిమాపక విభాగానికి చెందిన ఒడ్రాఫ్ సాయంతో యువకులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలిథిన్ కర్మాగారం సీజ్



కర్మాగారంలో సోదాలు నిర్వహిస్తున్న అధికారులు



కర్మాగారాన్ని సీజ్ చేసిన అధికారులు

జయపురం: చట్ట విరుద్ధంగా నడుపుతున్న పాలిథిన్ కర్మాగారాన్ని అధికారులు మంగళవారం సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జయపురం సమితి బంకబిజా గ్రామంలో బయో బ్యాగ్‌లు తయారు చేసేందుకు అనుమతులు పొందిన ఒక కంపెనీ, అక్రమంగా పాలిథిన్ సంచులను తయారు చేస్తోంది. దీంతో పాల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సీజ్ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కర్మాగారం మూసి ఉంటుందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ అధికారి దీపేశ్ కుమార్ బిశ్వాల్ స్పష్టం చేశారు. మీడియం, స్మాల్, మైనర్ ఇండస్ట్రీ పరిధిలో బయో డిగ్రిడేషన్ బ్యాగులు తయారు చేసేందుకు మాత్రమే యజమాని అనుమతులు తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ అధికారులు ఉత్పాదన సామగ్రి క్వాలిటీ పరీక్ష రిపోర్టుతో పాటు న్యూఢిల్లీ సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్ దాఖలు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. అయితే రోజులు గడుస్తున్నా యజమాని సమర్పించలేదని వెల్లడించారు. మరోవైపు ప్రభుత్వం పాలిథిన్ వినియోగంపై నిషేధం విధించిన విషయం గుర్తు చేశారు. గత నెలలో కర్మాగారాన్ని సందర్శించి పాలిథిన్ సంచుల తయారీపై నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. తదుపరి మరో నోటీసు పంపామని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ ఆదేశంతో సీజ్ చేశామని స్పష్టం చేశారు. సీజ్ చేసిన సమయంలో మెజిస్ట్రేట్‌గా జయపురం తహసీల్దార్ సాగరిక షొడంగి, జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తదితరులు ఉన్నారు.

31న రాఖీ పూర్ణిమ

భువనేశ్వర్: పూరీ జగన్నాథ స్వామి దేవస్థానంలో రాఖీ పూర్ణిమ ఈనెల 31వ తేదీన జరుపుకోవాలని నిర్ణయించారు. 30న రాఖీ జరుపుకోవాలనే ప్రతిపాదన తెరపైకి రావడంతో సందిగ్ధత చోటు చేసుకుంది. దీంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. ఆలయ ఆచార వ్యవహారాలకు సంబంధించిన వారందరితో సంప్రదింపులు జరిపి బలభద్ర భగవానుడి జన్మదినం పురస్కరించుకుని గహ్మ పూర్ణిమ సందర్భంగా 31న రక్షాబంధన్ ఉత్సవం నిర్వహించాలని శ్రీజగన్నాథ ఆలయ నిర్వాహకులు మరియు సేవకులు నిర్ణయించారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించిన వ్యక్తి అరెస్టు

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి ఒర్కేల్ పోలీసులు కోర్టు ఆదేశాలు ధిక్కరించిన రామ్‌ముల్తీ ఖోర (జిత్రో)ను మంగళవారం అరెస్టు చేశారు. 2022లో రామ్‌ముల్తీ ఖోర గంజాయి అక్రమ రవాణా కేసులో అరెస్టైయ్యాడు. అయితే ఇటీవల అతడిని బెయిల్‌పై విడుదల చేస్తూ, కోర్టు పిలిచినప్పుడు హాజరవ్వాల్సి ఉంటుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. కానీ అతను సరిగా కోర్టుకు హాజరవ్వకపోవడంతో కూడు ములగుమ్మ రహదారిలో పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు.

పాఠశాల సందర్శించిన యువ శాస్త్రవేత్త



విద్యార్థులతో ముచ్చటిస్తున్న శాస్త్రవేత్త కృష్ణ

పర్లాకిమిడి: ఇస్రో పరీక్ష కేంద్రం త్రివేండ్రంలో పనిచేస్తున్న పర్లాకిమిడి యువ శాస్త్రవేత్త ఎన్ని కృష్ణ రాణిపేటలోని 5టీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను హెచ్ఎం ఎస్.మణిమాల సన్మానించారు. విద్యార్థులకు రాకెట్ సైన్సుపై అవగాహన కల్పించారు. ఆయన రాణిపేటలో ప్రాథమిక విద్య, పర్లాకిమిడి మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో సెకండరీ విద్య, శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో బీఎస్సీ పూర్తిచేసి, ఉత్కళ యూనివర్సిటీ, ఐఐటీ కడక్పూర్‌లో ఎంటెక్ చేస్తూ ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. తర్వాత కాశీనగర్ బ్లాక్ నీలకంఠపూర్ గ్రామం వద్ద గిఫ్ట్ మోడల్ స్కూల్ విద్యార్థులతో ముచ్చటించారు.

ఆక్రమణలు తొలగింపు



శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్న పోలీసులు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

బరంపురం: బరంపురం అభివృద్ధి సంస్థ మరియు బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎంసీ పరిధి 38వ వార్డు అంకులిలో ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను జేసీబీతో పడగొట్టారు. ముందస్తు చర్యగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసుల సహకారం తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు అధికారులతో గొడవపడగా, పోలీసుల చొరవతో సద్దుమణిగింది.

క్లుప్తంగా

సిద్దార్థ పట్నాయక్‌కు సన్మానం



సిద్దార్థ పట్నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్‌ను భువనేశ్వర్ జాగా మిషన్ మంగళవారం ఘనంగా సన్మానించింది. రాష్ట్ర అర్బన్ డవలప్‌మెంట్ మంత్రి ఉషాదేవి సిద్ధార్థ పట్నాయక్‌కు మొమెంటో అందజేశారు. సిద్దార్థ పట్నాయిక్ కలహండి జిల్లా కెసింగ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ కార్యనిర్వాహక అధికారిగా 2020 నుంచి 2022 జనవరి వరకు పనిచేశారు. ఆ సమయంలో రైల్వే విభాగానికి చెందిన స్థలాన్ని ఇద్దరు వ్యక్తులు ఆక్రమించారు. దీంతో ఆక్రమణలు తొలగించి ఆ స్థలంలో ఉంటున్న 44 మంది ఇళ్లులేని నిరుపేదలకు జాగా మిషన్ ద్వారా కాలనీ నిర్మించారు. అటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టి నిరుపేదలకు సమకూర్చిన సిద్దార్థ పట్నాయక్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరపున భువనేశ్వర్ జాగా మిషన్ సన్మానించింది. భువనేశ్వర్ కళింగ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రధానమంత్రికి రాఖీ కట్టే అవకాశం

- రాష్ట్రానికి చెందిన ఇద్దరు మహిళలు ఎంపిక



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాఖీలు కట్టేందుకు ఎంపికైన మహిళలు

భువనేశ్వర్: రక్షా బంధన్ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాఖీ కట్టేందుకు రాష్ట్రం నుంచి ఇద్దరు మహిళలు ఎంపికయ్యారు. వీరు కటక్ జిల్లా అఠాగాడా ప్రాంతీయులు. అలాగే మహిళా వికాస్ పరిషత్ సభ్యులు. ఈ అవకాశం తమకు దక్కడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రక్షా బంధన్ సందర్భంగా మోదీకి రాఖీ కట్టేందుకు న్యూఢిల్లీలోని ప్రధాని నివాసానికి హాజరవ్వాలని ఆహ్వానం అందుకున్న 50 మంది మహిళల్లో, రాష్ట్రానికి చెందిన ప్రతిమా బెహెరా, సబితా దాస్ ఉన్నారు. ఇద్దరూ ఖాదీతో సహా అనేక రకాల ఉత్పత్తులను ఉత్పత్తి చేసే కళాకారులు. ఐదు రోజుల క్రితమే వీరికి ఈ సమాచారం అందింది. ఢిల్లీకి రావాల్సిందిగా ఆహ్వానం అందడంతో అందుకు తగ్గట్టుగానే రాఖీని సిద్ధం చేశారు. తులసీ మరియు రుద్రాక్ష పూసలు ఉపయోగించి రాఖీ తయారు చేసినట్లు వివరించారు. సహజ వనరుల వినియోగంతో రాఖీల తయారీ, ఉత్పాదన సాటి కళాకారులకు లాభసాటిగా ఉంటుందన్నారు.

ప్రఫుల్ల సామంతరాయ్ అపహరణ..?



ప్రఫుల్ల సామంతరాయ్ (ఫైల్)

రాయగడ: లోక్‌శక్తి అభియాన్ జాతీయ ముఖ్య సలహాదారుడు, స్వాభిమాన్ పత్రిక సంపాదకుడు ప్రఫుల్ల సామంతరాయిని గుర్తు తెలియని కొందరు అపహరించారనే వదంతులు వినిపిస్తున్నాయి. స్థానిక కై లాస్ హోటల్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మోహన్ నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భవానీ శంకర్ జెన్నల ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం భువనేశ్వర్ నుంచి వచ్చిన సామంతరాయ్ ఒక హోటల్‌లో బస చేశారు. సాయంత్రం 4 గంటలకు జరిగే పాత్రికేయుల సమావేశంలో పాల్గొనాల్సి ఉన్నా, సామంతరాయ్ సాయంత్రం 5 గంటల వరకు హాజరుకాలేదు. ఆయన కోసం భవానీ జెన్న పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్విచ్ ఆఫ్ రావడంతో సమావేశాన్ని ముగించారు. అయితే కొద్దిసేపటి తర్వాత ప్రఫుల్ల సామంతరాయ్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారనే వార్తలు ప్రచారం కావడంతో అతనిని పోలీసులు తీసుకెళ్లారా లేదా ఇంకెవరైనా అపహరించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎటువంటి సమాచారం లేదు: పోలీసులు

ఈ నేపథ్యంలో సదరు పోలీసుస్టేషన్ ఐఐసీ కమలా కాంత్ కుహరోను విలేకరులు సంప్రదించగా సామంతరాయ్ అపహరణకు సంబంధించి తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని వివరణ ఇచ్చారు. అసలు సామంతరాయ్‌ను ఎవరు అపహరించారనే విషయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని కాసీపూర్ సమితి కుచేయిపాదొరొ పంచాయతీలోని బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ (ఓఎంసీ) వేదంత్ కంపెనీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో వేదాంత్ కంపెనీ మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే ప్రైవేటు సంస్థకు అక్కడ వాస్తవ పరిస్థితులు అధ్యయనం చేయమని బాధ్యతలు ఇచ్చింది. ఆ ప్రాంత ప్రజలు బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తున్న తరుణంలో ప్రజలకు మద్దతుగా ప్రఫుల్ల సామంతరాయ్ రాయగడకు వచ్చి పాత్రికేయుల సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. అయితే అందుకు కొందరు ఆయనను సమావేశంలో పాల్గొకుండా అడ్డుకున్నట్లు సమాచారం అందుతుంది.

రాష్ట్రానికి ఈసీఐ బృందం



మాట్లాడుతున్న రాష్ట్ర సీఈవో నికుంజొ బిహారి ధొలొ

- సెప్టెంబర్ 13న పర్యటన
- ముందస్తు ఎన్నికల ఊహాగానాలకు ఆజ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న చర్చల మధ్య భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బృందం సెప్టెంబర్ నెలలో రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తున్నట్లు ప్రకటితం కావడం రాజకీయ శిబిరాల్లో కొత్త ఉత్సాహం నిప్పుతోంది. సెప్టెంబర్ 13న భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బృందం రాష్ట్ర పర్యటనకు విచ్చేయనుంది. జాతీయ ఎన్నికల సంఘం సభ్యుల బృందం రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నికుంజొ బిహారి ధొలొ మంగళవారం తెలియజేశారు. ఇప్పటికే తొమ్మిది జిల్లాలకు వీవీప్యాట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) చేరాయి. వీటి పరిశీలనకు కార్యక్రమం ఖరారు అయింది. అక్టోబర్ మొదటి వారంలో వీవీప్యాట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ నవంబర్ 15వ తేదీ వరకు నిరవధికంగా కొనసాగుతుంది. అయితే ఇది ఓ సాధారణ ప్రక్రియగా సీఈవో పేర్కొన్నారు. దీంతో ముందస్తు ఎన్నికలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు.

కష్టతరమైన సుదీర్ఘ ప్రక్రియ

ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం చేయడం కష్టతరమైన సుదీర్ఘ ప్రక్రియగా సీఈఓ వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా అనుబంధ వర్గాలకు శిక్షణ ఇప్పించాలి. మాన్యువల్‌ను సిద్ధం చేసి ముద్రించాలి. మరెన్నో అనుబంధ ఉపకరణాలు, ఇతరేతర సరంజామా సిద్ధం చేయడం అత్యంత కష్టతరమైన ప్రక్రియగా వివరించారు. భారత ఎన్నికల సంఘం ప్రకటించే కార్యక్రమం ప్రకారం ఎన్నికలు నిర్వహి ంచేందుకు సిద్ధం అవుతున్నట్లు పేర్కొన్నారు.

నవంబర్ తర్వాతే..

వీవీప్యాట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన కార్యక్రమం నవంబర్ 15వ తేదీ వరకు నిర్వహించేందుకు కార్యక్రమం ఖరారైంది. ఈ పరిస్థితుల్లో అంతకుముందు ఎన్నికలు జరిగే ప్రసక్తే లేనట్లు స్పష్టం అవుతుంది. కీలక ప్రక్రియ జరుగుతుండగా పోలింగు వంటి అనుబంధ ప్రక్రియకు సాధ్యం కాదు. ఈ లెక్కన ఈ ఏడాది డిసెంబర్ నుంచి ఏ క్షణంలోనైనా ముందస్తు ఎన్నికలు జరిగేందుకు సానుకూల పరిస్థితులు అలముకుంటున్నాయి.

ప్రభుత్వం హడావుడితో ముందస్తు సంకేతం

రాష్ట్రంలో ప్రభుత్వ పోకడ ముందస్తు ఎన్నికల సంకేతాలను బలపరుస్తోంది. ఇటీవల కాలంలో ప్రభుత్వం తరచూ మంత్రి మండలి సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. దాదాపు ప్రతీ సమావేశంలో పలు ప్రజాకర్షిత పథకాలను ప్రకటిస్తోంది. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన ప్రజాకర్షిత పథకాల్లో మో ఘురొ యోజన, మిషన్ శక్తి స్కూటీ యోజన, అమ్మొ ఒడిశా నవీన ఒడిషా, నూతన ఉన్నత అభిలాష పథకాలు చోటు చేసుకున్నాయి. 2 నెలల స్వల్ప వ్యవధిలో ఇటువంటి భారీ పథకాలను ప్రభుత్వం ప్రకటించడం విశేషం. రాష్ట్రంలో బ్యాంకింగ్ సేవల సౌలభ్యం లేని 4,373 గ్రామ పంచాయతీల్లోనూ బ్యాంకింగ్ సౌకర్యాలను సృష్టించేందుకు మౌలిక సదుపాయాలను కల్పించే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఇటీవల ఆమోదించింది.

వ్యూహాత్మకంగా కాంగ్రెస్

ముందస్తు ఎన్నికల అవకాశం సద్వినియోగపరచుకునేందుకు రాష్ట్ర కాంగ్రెసు తనదైన శైలిలో కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నేతృత్వం సరికొత్త వ్యూహాత్మక శైలితో ఆచితూచి అడుగు వేస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రధానంగా పార్టీలో అంతః కలహాలను తొలగించి మనస్పర్దలకు ఏమాత్రం అవకాశం లేకుండా కార్యకర్తలను ఏక తాటిపైకి తెచ్చేందుకు ఆయన చురుకుగా సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నుంచి ఇటీవల దూరమైన పలువురు సీనియర్ నేతలను తిరిగి కాంగ్రెసు శిబిరానికి రప్పించే ప్రయత్నంలో తలమునకలై ఉన్నారు. మారోవైపు రాహుల్ గాంధీ, ప్రియాంక రాష్ట్ర పర్యటనకు రంగం సిద్ధం చేశారు. పార్టీ కార్యకర్తలతో వీరివురు ప్రత్యక్షంగా స్పందించి వారిలో కొత్త ఉత్సాహాన్ని ప్రేరేపిస్తారని శరత్ పట్నాయక్ భావిస్తున్నారు. సమైక్య భావాలతో కార్యకర్తల్లో అంకిత భావం కూడగట్టుకుని త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెసుని బలోపేతం చేసేందుకు నడుం బిగించారు.

సెప్టెంబర్ ఉత్కంఠం

ముందస్తు ఎన్నికల ఊహాగానాల మధ్య భారత ఎన్నికల సంఘం ప్రతినిధుల బృందం రాష్ట్ర పర్యటనతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా సెప్టెంబర్ నెలలో ఈ మేరకు ముఖచిత్రం స్పష్టమవుతుందని భావిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నాలుగు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలతో రాష్ట్రంలో శాసన సభకు ఎన్నికలు నిర్వహించే యోచన గత కొన్ని రోజులుగా చర్చనీయాంశమైంది. ఈ పరిస్థితుల దృష్ట్యా సెప్టెంబర్ నెల ప్రాధాన్యత సంతరించుకుంది. ఊహాగానాలు వాస్తవ కార్యరూపం దాలిస్తే ఈ ఏడాది డిసెంబర్ నెలలో ముందస్తుగా రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన సెప్టెంబర్ నెలలో అసెంబ్లీ రద్దుకు శాసన సభ సిఫారసు చేయాల్సి ఉంటుంది. లోగడ ముందస్తు ఎన్నికల కోసం తెలంగాణ అసెంబ్లీని 2018 సెప్టెంబర్ మొదటి వారంలో రద్దు చేసి, అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ జారీ అయి, డిసెంబర్ నెలలో ఎన్నికలు నిర్వహించిన తరహాలో ఈసారి రాష్ట్రంలో జరగనున్నట్లు భావిస్తున్నారు.

కలియగాం పంచాయతీ కార్యాలయం ముట్టడి



పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న సామంతరాయ్

జయపురం: సమితిలోని కలియగాం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రజా సమస్యలపై అంబాగుడ మండల్ బీజేపీ శ్రేణులు మంగళవారం ముట్టడించాయి. పంచాయతీలో అభివృద్ధి పనులు, సంక్షేమ, సహాయ కార్యక్రమాలు ప్రజల వద్దకు చేరడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ కమిటీ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్ మాట్లాడుతూ పంచాయతీలో ప్రజలకు కనీస మౌలిక వసతులు అందడం లేదని ఆరోపించారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు కలుషిత నీటినే తాగాల్సిన దారుణమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. అభివృద్ధి పనులు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని, కనీసం శ్మశాన వాటిక లేదని. పెన్షన్ల చెల్లింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారని దుమ్మెత్తిపోశారు. వెంటనే అధికారులు సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని, లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో మండల్ బీజేపీ అధ్యక్షుడు పాఢీ, నళినీ దాస్, పంపుణీ బీజేపీ మండల అధ్యక్షుడు దీనబందు ప్రధాన్, జయపురం పట్టణ మండల అధ్యక్షుడు రాధేశ్యామ్ పారిడ, ఇచ్చా మాలి, అభి కర్లియ, హరిశ్చంద్ర మాలి, నారాయణ భయి, రాము బెహర తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ పనుల పరిశీలన



డీఆర్ఎంకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: ఈస్టుకోస్టు రైల్వే డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్నం-గుణుపూర్ ప్యాసింజర్‌లో పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్లాట్‌ఫారం, స్టేషన్ కార్యాలయం, ప్లాట్‌ఫారంపై ఎలక్ట్రిక్ దీపాల పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలియజేశారు. ఆయనకు గజపతి జిల్లా బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనను కలిసినవారిలో బీజేపీ సాధారణ కార్యదర్శి ఈ.ప్రశాంత్, కుమార్, కోడూరు కిరణ్‌కుమార్, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, గుసాని సమితి మాజీ అధ్యక్షురాలు జమానా భారతమ్మ తదితరులు ఉన్నారు.

ట్రయల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్‌కు ఉపయోగించిన విమానం

- త్వరలో ప్రత్యక్ష విమాన సేవలు

భువనేశ్వర్: కలహండి జిల్లా భవానీపట్న నుంచి రాష్ట్ర రాజధాని నగరం భువనేశ్వర్‌కు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం ఘడియలు దగ్గర పడుతున్నాయి. భవానీపట్న ఉత్కెలా విమానాశ్రయం మరియు భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) మధ్య మంగళవారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతం అయ్యింది. భువనేశ్వర్ నుంచి ఉదయం 8.22 గంటలకు బయల్దేరిన విమానం 9.20 గంటలకు భవానీపట్న జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్కెలా విమానాశ్రయానికి చేరింది.

ఈనెల 31 నుంచి నిరంతర సేవలు

భువనేశ్వర్, భవానీపట్న మధ్య నిరంతర విమాన సేవలు ఈనెల 31న ప్రారంభం కానున్నాయి. ప్రారంభోత్సవం పురస్కరించుకుని తొలి విమానం ఉదయం 10.35 గంటలకు బయల్దేరే అవకాశం ఉంది. తొలి దశలో తొమ్మిది సీట్ల సౌకర్యంతో ఇండియా వన్ ఎయిర్ సంస్థ తొలి దశ విమానయానానికి ఏర్పాట్లు చేస్తోంది. తదుపరి దశలో ఈ సేవలను ఛత్తీస్‌గఢ్, రాయ్‌పూర్ వరకు విస్తరించే యోచన పరిశీలనలో ఉంది.

సామాన్యుని కల సాకారం

సామాన్యుడు విమానయానం చేసే అవకాశాలను మెరుగుపరిచే ప్రాంతీయ కనెక్టివిటీ పథకం ఉడే దేశ్ కి ఆమ్ నాగరిక్ (ఉడాన్) కింద కలహండి జిల్లా భవానీపట్న ఉత్కెలా విమానాశ్రయం నుంచి విమానయాన సౌకర్యాలు కల్పించడం విశేషం. ఈ విమానాశ్రయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, రన్ వే, టెర్మినల్ భవనాల కోసం దాదాపు రూ.162 కోట్లు వెచ్చించింది. డైరెక్టర్ జనరల్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఈ ఏడాది ఆగస్టు 7న విమాన కార్యకలాపాలను ప్రారంభించడానికి లైసెన్స్ జారీ చేసింది. విమానాశ్రయంలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా తొలి విమానాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్థానిక విమానాశ్రయం నుంచి పాలుపంచుకుంటారు. భవానీపట్న ఉత్కెలా విమానాశ్రయంలో రాష్ట్ర వాణిజ్య మరియు రవాణా శాఖ మంత్రి టుకుని సాహుతో పాటు స్థానిక పార్లమెంట్ సభ్యుడు వసంత పండా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక జంగంవీధి ఎస్.ఎ.ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న అష్టలక్ష్మి దేవి లక్ష కుంకుమార్చన పూజలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ 55 మంది ముత్తయిదువులు అష్టలక్ష్మీ దేవి కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. చివరి రోజు మంగళవారం కళింగ వైశ్య సంఘం మహిళల ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

వృద్ధురాలి పుస్తెలతాడు తెంపివేత

సీతానగరం: మండలంలోని ఆర్ వెంకంపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు పెంట ఆదిలక్ష్మి మెడలో పుస్తెల తాడును సోమవారం ఇద్దరు వ్యక్తులు తెంచి పారిపోయారు. వివరాలిలా ఉన్నాయి. ఉదయం పొలానికి వెళ్తున్న ఆమెను ఇద్దరు వ్యక్తులు వెంబడించి అడ్డగించి మద్యం సీసాలతో తలపై కొట్టి మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కుని పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిలక్ష్మి కుటుంబసభ్యులు పొలం పనులకు ముందు వెళ్తుండగా కొంత వ్యవధిలో బయల్దేరిన ఆమె దూరంగా నడుస్తోంది. ఆమె గ్రామంలో బయల్దేరినప్పటి నుంచి గమనిస్తున్న ఇద్దరు దుండగులు వెంబడించి మార్గమధ్యంలో ఆమెపై దాడి చేసి మెడలోఉన్న సుమారు 2.5 తులాల పుస్తెల తాడును లాక్కున్నారు. ఈ ఘటనపై ఎస్సై కె.నీలకంఠం వద్ద ప్రస్తావించగా బాధితుల ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మంగళవారం తెలియజేశారు.

సిగరెట్ల అక్రమ వ్యాపారులపై దాడులు



స్వాధీనం చేసుకున్న సిగరెట్ బాక్సులతో అధికారులు

బొబ్బిలి: పట్టణంలో సిగరెట్ల అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, ఇతర అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన హెచ్-10,గుడ్ టైమ్స్ సిగరెట్ ప్యాకెట్లను అనుమతులు లేకుండా స్థానికంగా హోల్‌సేల్‌గా విక్రయిస్తున్న మేదరిబందకు చెందిన గెంబలి వెంకటరమణ నుంచి రూ.41వేల విలువైన 1633 ప్యాకెట్లను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ప్రజారోగ్యానికి హాని కలిగించే అన్‌బ్రాండెడ్, బ్యాన్డ్ సిగరెట్లను నిందిత వ్యాపారి కలిగి ఉన్నట్టు ధ్రువీకరించామని అధికారులు తెలిపారు. ఏఎస్సై బీవీ రమణ, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ సిబ్బంది తదితరులు దాడుల్లో పాల్గొనగా ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచిపోయిన లింగరాజు సేవలు

భువనేశ్వర్: ఏకామ్ర క్షేత్ర వాసుడు ఉపవాసం పాలయ్యాడు. సోమవారం రాత్రి నుంచి లింగరాజు స్వామివారికి సేవాదులతో నైవేద్యం సమర్పణ కార్యకలాపాలు స్తంభించి పోయాయి. ఇరువర్గాల సేవకుల మధ్య వివాదంతో ఈ విచారకర పరిస్థితి తాండవిస్తోంది. యజ్ఞోపవీత సేవ (పాయిత లగ్గి) నిర్వహణ పురస్కరించుకుని ఇరువర్గాల సేవకుల మధ్య వివాదం నెలకొంది. సోమవారం సాయంత్రం బొడొ సింగారొ అలంకర సేవ పురస్కరించుకుని వివాదం చెలరేగింది. అది మొదలుకొని రాత్రింబవళ్లు లింగరాజు ప్రభువు నిత్య సేవాదులు నిలిచిపోయాయి. బొడు నియోగులు, పూజా పండా వర్గం సేవాయత్‌ల మధ్య వివాదం చెలరేగింది. పాయిత లగ్గి సేవ నేపథ్యంలో 2020 సంవత్సరం నుంచి ఈ వర్గాల మధ్య వివాదం కొనసాగుతోందని లింగరాజ్ ఆలయ సూపర్‌వైజర్ రాజ్ కిషోర్ మహాపాత్రో మంగళవారం మీడియాకు తెలిపారు.

ఇదీ విషయం

ఆలయ హక్కుల రికార్డు ప్రకారం బొడు నియోగుల సేవకులు 27 పోగులతో కూడిన యజ్ఞోపవీతం ఏకామ్ర క్షేత్రం పీఠాధిపతి లింగరాజుకు సమర్పించడం పాయిత లగ్గిగా పేర్కొంటారు. పూజా పండా వర్గీయులు తమకు మూడు పోగులతో పాయిత స్వామికి సమర్పించే అవకాశం కల్పించాలని దీర్ఘకాలంగా పట్టుబడుతున్నారు. ఈ లెక్కన బొడు నియోగు సేవలుకు 27 బదులుగా 24 పట్టు పోగుల పవిత్ర యజ్ఞోపవీతం సమర్పించాల్సి ఉంటుందని వాగ్వుద్దానికి దిగారు. ఇది ఆమోదయోగ్యం కాదని ప్రత్యర్థి వర్గం ఎదురు తిరగడంతో వివాదం చోటు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ కమిషన్ మరియు ఆలయ ట్రస్టు బోర్డు పెడచెవి వైఖరి ఈ పరిస్థితికి కారణమని సేవకుల వర్గం ఆరోపిస్తోంది.



లింగరాజు ఆలయం

ఈ వివాదం పురస్కరించుకుని ఈ వర్గాలు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసి ఉంటే, స్వామివారికి నైవేద్యం లేకుండా ఉపవాసం ఉండాల్సిన పరిస్థితి తలెత్తేది కాదని అంటున్నారు. సోమవారం సాయంత్రం నుంచి స్వామివారు ఉపవాసం పాలయ్యాడు. శతాబ్దాల నాటి పుణ్యక్షేత్రంలో ఆచార వ్యవహారాలను ఎవరూ ఆపలేరని ఒడిశా హైకోర్టు 2012 సంవత్సరంలో తీర్పునిచ్చింది. ఈ ఉత్తర్వులు నీరుగారి పోయిన పరిస్థితులు ప్రస్తుతం తాండవిస్తున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మల్కన్‌గిరి: మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

బరంపురం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గంజాం క్రీడా కార్యదర్శి అశోక్ కుమార్ సాహు అన్నారు. ధ్యాన్‌చంద్ పుట్టినరోజును పురస్కరించుకొని జిల్లా క్రీడా సంఘం ఆధ్వర్యంలో స్థానిక బరంపురం క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ పటంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి అశోక్ కుమార్ పట్నాయక్, బాక్సింగ్ కోచ్ శిశిర్ పాణిగ్రహి, బాస్కెట్ బాల్ కోచ్ కాజల్, కె.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లాలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక డీఎన్‌కే మైదానం నుంచి స్టేడియం వరకు మినీ మారథాన్ నిర్వహించారు. మారథాన్‌ను జిల్లా క్రీడాధికారి ధ్రువచరణ్ ముదులి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన సభలో అతిథులు మాట్లాడుతూ.. మేజర్ ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో ప్రమిళ మాఝి, జిల్లా క్రీడా కోచ్‌లు పప్పు సింగ్, కూలమణి నిహల్ భసంత్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బరంపురం: ధ్యాన్‌చంద్ చిత్రపటంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెరువులో పడి వ్యక్తి మృతి

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన సిరికి శ్రీనివాస్(55) చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాస్ ప్రతిరోజు సాయంత్రం కళ్లానికి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుంటాడు. రోజూలాగానే సోమవారం రాత్రి కళ్లానికి వెళ్లిన ఆయన తిరిగి ఎంతసేపటికి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం గ్రామం సమీపంలో ఉన్న అయ్యచెరువులో శ్రీనివాస్ మృతదేహం తేలిఉండడంతో గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు పోలీసులు వచ్చి చెరువులో నుంచి శ్రీనివాస్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. బహిర్భూమికి వెళ్లి చెరువులో పడి ఈతరాకపోవడంతో మృతిచెందాడని మృతుడి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఏఎస్సై ఆర్.నర్సింగరావు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు సాయి, ఉన్నారు.

లారీ ఢీకొని మరో వ్యక్తి..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి-గర్భాం ప్రధాన రహదారిలో ఫేకర్ కొబ్బరితోట వద్ద జరిగిన ప్రమాదంలో మెరకముడిదాం మండలం సింగవరం గ్రామానికి చెందిన మంగి వెంకటరమణ(53) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుమార్తె మంగి గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మెరకముడిదాం మండలం ఇప్పలవలస గ్రామంలో జరిగే తన మేనమామ వివాహానికి హాజరయ్యేందుకు భీమిలిలో డిప్లమో చేస్తున్న మృతుడి కుమార్తె గాయత్రి విజయనగరం వరకు బస్సు ప్రయాణం చేసింది. విజయనగరం నుంచి తండ్రి వెంకటరమణతో కలిసి బైక్‌పై మెరకముడిదాం మండలం ఇప్పలవలస గ్రామానికి వెళ్తుండగా గరివిడి దాటిన తరువాత గరివిడి-గర్భాం ప్రధాన రహదారిలో ఫేకర్ కొబ్బరితోట వద్దకు వచ్చే సరికి ఎదురుగా గర్భాం నుంచి వస్తున్న లారీ వారి బైక్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తండ్రీ,తుళ్లు బైక్‌పై నుంచి కింద పడిపోగా వెంకటరమణ తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో సంఘటన స్థలంలో మృతిచెందాడు. గాయత్రికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

పాతపట్నం పంచాయతీ కార్యదర్శిపై విచారణ

ఎల్.ఎన్.పేట: పాతపట్నం మేజర్ పంచాయతీ కార్యదర్శి టి.హరికృష్ణపై జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, టెక్కలి డివిజన్ డీఎల్‌పీఓ ఐవీ రమణ మంగళవారం పాతపట్నం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన టి.హరికృష్ణ కొన్నేళ్ల కిందట బదిలీపై వెళ్లిపోయారు. అయితే హరికృష్ణ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు జెడ్పీ సీఈఓ తెలిపారు. మేజర్ పంచాయతీ నుంచి నాలుగు బిల్లులతో రూ.17.40లక్షలు సీఎస్ఎంఎస్ ద్వారా అప్‌లోడ్ చేసి నిధులు స్వాహా చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన పాతపట్నం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన కార్యదర్శి టి.హరికృష్ణ, తర్వాత వచ్చిన పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, రికార్డు అసిస్టెంట్ కిశోర్, సర్పంచ్ శిమ్మ వేణుకుమారి, ప్రస్తుత మేజర్ పంచాయతీ ఈఓ కూర్మారావులను వేర్వేరుగా విచారణ చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. ఫిర్యాదుకు సంబంధించిన విచారణ నివేదిక పీఆర్ కమిషనర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో టూరిజం డివిజనల్ మేనేజర్



ఆదిత్యుని జ్ఞాపికను హరితకు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ టూరిజం డివిజనల్ మేనేజర్ కె.హరిత మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ అర్చకులు ఆమె గోత్రనామాలతో పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వేదాశీర్వచనాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా విశాఖ డివిజనల్ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, ఇంజినీరింగ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు ఉన్నారు.

పాలన చట్టాలపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీ రాజ్ కార్యదర్శులకు పాలన వ్యవహారాలపై అవగాహన అవసరమని జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 30 మండలాల నుంచి 200 మంది గ్రామ కార్యదర్శులకు ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక స్థానికంగా పాలన సాగుతోందని అన్నారు. పాలనలో పంచాయతీ రాజ్ చట్టాలు పక్కాగా అమలు కావాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రస్తుతం అమలవుతున్న నేపథ్యంలో రికార్డుల నిర్వహణ, పంచాయతీ తీర్మానాలు, అనుమతులు అన్నీ నిబంధనలకు లోబడి ఉండాలని సూచించారు. కీలకమైన అంశాలకు సంబంధించి అధికారుల నుంచి సమాచారం తెలుసుకోవాలని, న్యాయ సలహాలు సైతం పాటించాలని వివరించారు.

'గొలుసు గురించి పట్టించుకోరా..?'

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలో గత నెల 21వ తేదీన సాగునీటి కాలువ పనులు చేశారు. ఆ పనుల్లో సుమారు 30 మంది పనిచేయగా.. అక్కడ నాలుగు తులాల బంగారు గొలుసు దొరికింది. బి.అప్పారావు అనే వ్యక్తి ఆ గొలుసును తీసుకుని ఇంటికెళ్లిపోయారు. ఆ తర్వాత పనికి రావడం మానేశారు. తోటి వేతనదారులు వెళ్లి అడగడంతో ఆ గొలుసును అక్కడే పడేశానని తెలిపాడు. దీంతో వేతనదారులంతా కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ స్పందించకపోవడంతో సోమవారం ఎస్పీ జీఆర్ రాధికకు జరిగిన విషయాన్ని విన్నవించారు. దొరికిన బంగారం బాధితురాలికి గానీ ప్రభుత్వానికి గానీ ఇవ్వాలని కోరారు. దీనిపై ఎస్పీ టెక్కలి సీఐ చంద్రమౌళికి ఆదేశాలు ఇచ్చారు. తమను స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు గానీ గొలుసు విషయం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఖేలో ఇండియా పోటీల్లో గోల్డ్ మెడల్

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 26, 27 తేదీల్లో తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో సెంట్రల్ స్పోర్ట్స్ మినిస్టరీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఖేలో ఇండియా పెన్‌కాక్ సిలాట్ ఉమెన్స్ లీగ్ పోటీల్లో పాల్గొన్న సిక్కోలు యువతి మాకివలస గౌతమి బంగారు పతకం సాధించారు. అలాగే కొర్రాయి యోచిత సిల్వర్ మెడల్ సాధించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ శ్రీధర్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సాంబమూర్తిలు వీరికి అభినందనలు తెలియజేశారు. అలాగే జిల్లా పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ అధ్యక్షుడు గ్రాండ్ మాస్టర్ రేగిడి దయామయ, ప్రధాన కార్యదర్శి, కోచ్ నక్క లక్ష్మణ్ నాయుడు సీనియర్ కుంగ్‌ఫు మాస్టర్లు చిట్టి సూర్య నారాయణ, అలికాన రామారావులు మాట్లాడుతూ ఖేలో ఇండియా పోటీలలో మన జిల్లావాసి బంగారు పథకం గెలుచుకోవటం ఇదే మొదటి సారని తెలిపారు.

పతాక స్థాయికి ఖాదీ ఖ్యాతి



ఎర్రకోట అనగానే ఎవరికైనా పతాకావిష్కరణ గుర్తుకొస్తుంది. వినువీధిలో త్రివర్ణ పతాక రెపరెపలు చూడగానే మనసు దేశభక్తితో ఉప్పొంగిపోతుంది. అటువంటి వేడుకలో ఖాదీకి కూడా చోటు లభిస్తే.. నేరుగా దేశ ప్రధాని మోదీతో ముచ్చటించే అవకాశం లభిస్తే.. మన ముఖం పొందూరు జరీ ఖాదీ పంచె అంచులా మెరిసిపోతుంది. ఉత్సాహం ఉప్పొంగి మనసే ఉత్సవ వేదికగా మారుతుంది. సరిగ్గా అటువంటి అపురూప అనుభవమే ఇద్దరు పొందూరు ఖాదీ కళాకారుల సొంతమైంది. స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వామి అయిన పొందూరు ఖాదీ ప్రతినిధులుగా దేశ రాజధాని ఎర్రకోట వద్ద జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని, ప్రధానితో మాట్లాడే అపురూప క్షణాలు జీవితంలో మర్చిపోలేనివని ఉత్సవాల్లో పాల్గొన్న నేతకారులు గర్వంగా చెబుతున్నారు. ఢిల్లీ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వారినే ఎందుకు ఎంపిక చేశారు? వారి ప్రత్యేకత ఏమిటి? ఢిల్లీలో అనుభవాలు ఏమిటి? వారి నుంచే తెలుసుకుందాం. – శ్రీకాకుళం డెస్క్



కాంతమ్మా.. కుశలమా..

ఈమె పేరు జల్లేపల్లి కాంతమ్మ. పొందూరు. వయసు 75. ఆరేళ్ల ప్రాయం నుంచి సంప్రదాయ ఖాదీ వస్త్రం తయారు చేస్తోంది. దేశంలోనే నూలును నాణ్యంగా వడికే నైపుణ్యం గల అతికొద్ది మంది వ్యక్తుల్లో కాంతమ్మ ఒకరు. ముగ్గురు కుమారులు బాగానే స్థిరపడినా.. ఖాదీ మీద మక్కువతో ఆమె పాత ఇంటిలోనే ఉంటూ రోజుకు 6 గంటలు ఇదే పనిలో నిమగ్నమవుతున్నారు. కేవలం రోజుకు రూ.200 మాత్రమే సంపాదిస్తున్నా.. కోట్ల రూపాయల విలువైన తృప్తి కోసమే తాను ఈ పని చేస్తున్నానని గర్వంగా చెబుతున్నారు ఆమె. తాను 75 ఏళ్ల వయసులో కూడా ఇంత ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నానని అంటే అది ఖాదీ పుణ్యమేనని.. గర్వంగా చెబుతారు కాంతమ్మ.

అసలు కాంతమ్మ ఎంచుకున్న సంప్రదాయ విధానం ఏమిటి..

ఖాదీ వస్త్రం తయారీలో ఈ దశలు కీలకమైనవి..



వాలుగు చేప ముల్లుతో పత్తిని శుభ్రపరచడం

పింజ చేసి పొట్టు తీయడం



నిడుచుటగా పిలిచే ప్రక్రియలో పత్తి గింజలను వేరు చేయడం



పత్తిని మెత్తగా తయారు చేయడం



వడకడం



ఏకు చుట్టడం



చిలపలు పోయడం

మరిచిపోలేని జ్ఞాపకం..

నేను చదువుకోలేదు. ఊహ తెలిసినప్పటి నుంచి నాకు తెలిసింది.. ఖాదీ తయారీలో భాగమవ్వడమే. నేను ఏ రోజూ కష్టపడుతున్నాననే భావన నాలో రానీయను. ఇష్టంగా పనిలో నిమగ్నమవుతా. నన్ను కలిసేందుకు చాలా మంది వస్తుంటారు. ఖాదీ తయారీలో ప్రక్రియల్ని ఓపికగా వివరిస్తా. వారికి అర్థమయ్యేంత వరకు విడిచిపెట్టను. ఖాదీ గొప్పతనాన్ని వారికి చెబుతా. ఢిల్లీ.. ఎర్రకోట ప్రధాన మంత్రి వంటి పదాలు వినడమే తప్ప.. నేను ఎప్పుడూ చూస్తానని కలలో కూడా ఊహించ లేదు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకకు నాలాంటి సామాన్యురాలిని ఎర్రకోటకు పిలిచి స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాతో మాట్లాడడం నిజంగా నా అదృష్టం. చాలా గర్వంగా ఉంది.

– జల్లేపల్లి కాంతమ్మ, పొందూరు.

జరీ నేతకే మొనగాడు..



చిత్రంలో వీరిద్దరి పేర్లు భద్రయ్య, లక్ష్మి. భార్యభర్తలు. ఊరు పొందూరు. ఇద్దరూ నేతకారులే. జరీపంచె నేతలో ఒకే ఒక్కడు ఈ భద్రయ్య. మంచి నైపుణ్యం ఈయన సొంతం. ఏఎన్నార్ పేరుతో పిలిచే ఖాదీ పంచెకు బంగారం వర్ణంలో ఉండే అంచును అత్యంత అద్భుతంగా నేయడంలో ఈయనది అందె వేసిన చేయి. ఇంటర్ వరకు చదువుకున్న భద్రయ్య వృత్తిలో సంతృప్తి వెతుకునే వ్యక్తిత్వం ఉన్న మనిషి. రోజుకు కేవలం రూ.500 మాత్రమే సంపాదించే ఈయన జరీనేతలో దేశ వ్యాప్తంగా ఉన్న కొద్ది మందిలో మొనగాడే. ఈ నేతకు ఇద్దరు వ్యక్తులు అవసరం కావడంతో భార్య సహకారంతో మనసుకు నచ్చిన పనిచేసి దేశ ప్రధాని మనసును గెలుచుకున్నాడు ఈ నేతన్న.

ఏమిటీ ఈ జరీ నేత.. ఖరీదు ఎందుకంత..!



పంచెకు అంచు అందం. అంచు ఎంత ఎక్కువ తళుక్కుమంటే అంత ఖరీదైనదని అర్థం. శ్వేత, గోధుమ వర్ణంలో సున్నితంగా ఉండే ఖాదీ జరీపంచెలు కాస్త ఖరీదైన వ్యవహారం. మామూలు ఖాదీ పంచె రూ. 600 నుంచి రూ.800 మధ్యలో లభ్యమవుతుంది. ఒక్కో పంచె ఖరీదు రూ.11 వేల నుంచి రూ.13 వేల వరకు పలుకుతుందంటే దీని ప్రత్యేకత అర్థం చేసుకోవచ్చు.

జీవితాంతం గుర్తుండిపోయేలా..

ఉదయం లేవడం.. వృత్తిలో నిమగ్నమవ్వడం. నా కుటుంబం. ఇదే నా దినచర్య. ఢిల్లీకి బయల్దేరాలని ఖాదీ బోర్డు సభ్యులు చెబితే ఆశ్చర్యమేసింది. అదీ ఎర్రకోటలో జరిగే మువ్వన్నెల వేడుకకు.. ప్రధానిని కలిసేందుకు అంటే చాలా గర్వపడ్డాను. ప్రధానమంత్రిని దగ్గర నుంచి చూశా. ఓ నేతకారుడిగా నాకు దక్కిన ఈ గొప్పఅవకాశం.. ఆ అద్భుత క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. నాకు వృత్తిలో చేదోడు వాదోడుగా ఉండే నా భార్యతో సహా నేను ఢిల్లీకి వెళ్లడం జీవితంలో మరిచిలేనిది.

– బళ్ల భద్రయ్య, పొందూరు



- వీవ్ సిల్క్ దారాన్ని వెండిపూతలోకి పంపిస్తారు. తరువాత బంగారు పూత చేరుస్తారు. ఇలా ప్రత్యేక పద్ధతిలో తయారైన బంగారు రంగులో ఉండే జరీని పంచె నేతలో అంచుకోసం వినియోగిస్తారు.
- ఒక్కో పంచె అంచుకు 150 గ్రాముల వరకు జరీ అవసరం మవుతుందని చెబుతున్నారు తయారీ దారులు.
- కేజీ జరీ కండె ధర రూ.75 వేలు.. ఇది సూరత్ నుంచి వస్తుంది. ఒక కేజీ జరీని కరిగిస్తే 2 గ్రాముల నుంచి 4 గ్రాముల బంగారం వస్తుందని చెబుతున్నారు పంపిణీ దారులు.

మా నాన్నను బతికించండి

- కాలేయ వ్యాధితో బాధ పడుతున్న నిరుపేద
- చికిత్స కోసం ఇబ్బంది పడుతున్న కుటుంబం
- దాతలే ఆదుకోవాలని అభ్యర్థన



మంచానికే పరిమితమైన వెంకటరావు

జి.సిగడాం : ఆరు నెలలుగా ఆ కుటుంబం నరక యాతన అనుభవిస్తోంది. కూలి పనికి వెళ్తే గానీ రోజు గడవని పరిస్థితుల్లో ఆ ఇంటి యజమానికి కాలేయ వ్యాధికి గురై మంచానికే పరిమితమైపోయాడు. కాలేయ మార్పిడి జరిగితే గానీ అతని ప్రాణం దక్కదు. కానీ ఆపరేషన్ చేయించే స్థోమత ఆ నిరుపేద కుటుంబానికి లేదు. ప్రభుత్వ పెద్దలతోపాటు దాతలు సాయం చేస్తే తన భర్త ప్రాణాలు దక్కుతాయని ఆ ఇంటి ఇల్లాలు అభ్యర్థిస్తున్నారు. తండ్రికి వచ్చిన వ్యాధి ఏమిటో తెలియకపోయినా నాన్న ప్రాణాలు కాపాడండి ప్లీజ్ అంటూ ఇద్దరు చిన్నారులు విన్నవిస్తుండడం హృదయాలను ద్రవింపజేస్తోంది.

వివరాల్లోకి వెళితే..

మండల పరిధిలోని సంతవురిటి గ్రామానికి చెందిన సవలాపురపు వెంకటరావు (41) కాలేయ వ్యాధితో బాధ పడుతున్నారు. ఆరు నెలలుగా పరిస్థితి తీవ్రంగా ఉండగా.. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని నెల కిందటే డాక్టర్లు వారికి సూచించారు. ఆయనకు భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజేశ్వరి, వెంకటరావులు కూలి పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండేళ్ల నుంచి కాలేయ వ్యాధి ఆయనను ఇబ్బంది పెడుతూ ఇప్పుడు ముదిరిపోయింది. ఇప్పటికే విజయనగరం, విశాఖ, విజయవాడ, శ్రీకాకుళంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి చూపించారు. ఇప్పుడు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే ఆయన ప్రాణాలను కాపాడగలదని వైద్యులు చెప్పడంతో.. ఆపరేషన్ చేయించడానికి ఆ కుటుంబం అష్టకష్టాలు పడుతోంది. ఇప్పటికే రూ.15 లక్షల వరకు అప్పు చేశామని, ఇప్పుడు ఇంకో రూ.50 లక్షల వరకు అవసరమవుతోందని, ఇంత పెద్ద మొత్తం తీసుకురావడం తమ వల్ల కావడం లేదని రాజేశ్వరి కన్నీరు పెట్టుకుంటూ చెబుతున్నారు. దాతలే ముందుకువచ్చి సాయం అందిస్తే తన భర్త ప్రాణాలు కాపాడుకుంటానని అభ్యర్థిస్తున్నారు.

కూలి చేసి కాపాడుకుంటున్నాం



మాది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. నా భర్తను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. రోజువారీ కూలి డబ్బులు బతకడానికే సరిపోవడం లేదు. మరోవైపు ఇద్దరు పిల్లలను పోషించాల్సిన బాధ్యత కూడా నాపై ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో రూ.50 లక్షలు వైద్యం కోసం తీసుకురావడం నాకు తలకుమించిన పని. ప్రభుత్వం, దాతలే మమ్మల్ని ఆదుకోవాలి.

– ఎస్.రాజేశ్వరి, వెంకటరావు భార్య



మా నాన్నకు ప్రాణభిక్ష పెట్టండి అంటూ విన్నవించుకుంటున్న చిన్నారులు

సాయం చేయాలనుకునేవారు 99598 06655 నంబర్‌ను సంప్రదించాలని, ఫోన్ పే నంబర్ కూడా అదేనని కుటుంబ సభ్యులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకి ఎకో రాఖీ..



రంగురంగుల రాఖీలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కానీ అందులో పర్యావరణ హితమైనవి మాత్రం కొన్నే కనిపిస్తున్నాయి. చాలా వరకూ రాఖీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసినవే కనిపిస్తున్నాయి. ఇవి పర్యావరణానికి చేటు చేస్తాయి. ఈ రాఖీ పండగ నాడు అలాంటి కాలుష్య కారక రాఖీలు కాకుండా ఎకో రాఖీలు వినియోగించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. పర్యావరణానికి మేలు చేసే విధంగా వరి, జనప, చెరుకు వంటి వ్యవసాయ వ్యర్థాలతో పాటు గింజలు వినియోగించి ఎకో రాఖీల పేరిట ఓ అంకుర సంస్థ మార్కెట్‌లో విక్రయిస్తోంది. ఈ సంస్థ ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ తిరుపతి, కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందింది. ఈ రాఖీలో విత్తనాలు కూడా ఉంటాయి. అందువల్ల బయట పడేసిన కొన్నాళ్ల తర్వాత మొక్కలు పెరిగి పర్యావరణానికి మేలు చేస్తాయి. నీటిలో వేసినా జీవ రాశులకు ఆహారంగా ఉపయోగపడుతుంది. ఆ రాఖీలు కావాలంటే 7702724967 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. –నరసన్నపేట

బెదురులంక.. సిక్కోలు వంక



ప్రేక్షకులతో మాట్లాడుతున్న హీరో కార్తికేయ

బెదురులంక సినిమా యూనిట్ సిక్కోలులో సందడి చేసింది. శ్రీకాకుళంలోని సూర్యమహల్ థియేటర్‌కు వచ్చిన హీరో కార్తికేయ సినిమాను విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. మంచి సినిమాను ఎప్పుడూ ఆదరిస్తారని తెలుగు ప్రేక్షకులు మరోసారి రుజువు చేశారన్నారు. గతంలో ఆర్ఎక్స్ 100 సినిమా ప్రమోషన్‌లో భాగంగా శ్రీకాకుళం వచ్చానని, ఇపుడు బెదురులంక సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇక్కడకు మళ్లీ వచ్చానని చెప్పారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో షూటింగ్ చేయడం జరిగిందని, శ్రీకాకుళం జిల్లాలో కూడా మంచి లొకేషన్‌లు ఉన్నాయని, అవకాశం వచ్చినపుడు తప్పకుండా షూటింగ్ చేస్తామన్నారు. ఒక్కొక్కటిగా ఎంచుకుని మంచి చిత్రాలు చేయడం జరుగుతుందన్నారు. అల్లు అర్జున్‌కు జాతీయస్థాయి అవార్డ్ రావడం గర్వంగా ఉందని, తెలుగు సినిమాకు జాతీయస్థాయి బెస్ట్ యాక్టర్ అవార్డు లేదనే కొరత ఉందని, అది ఇలా తీరిందన్నారు. కార్యక్రమంలో సూర్యమహల్ యాజమాన్యం ధనంబాబు, నాగరాజు, మేనేజర్ నాగభూషణం తదితరులు ఉన్నారు. –శ్రీకాకుళం అర్బన్

వంశధార కాలువలో వ్యక్తి గల్లంతు



వంశధార కుడి కాలువ గట్టుపై ఉన్న బాలకృష్ణ దుస్తులను పరిశీలిస్తున్న పోలీసులు

హిరమండలం: శుభకార్యం జరగాల్సిన ఇంట విషాదం నెలకొంది. హిరమండలం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాతపట్నం మండలం సీది గ్రామానికి చెందిన మద్ది బాలకృష్ణ హిరమండలం లొట్టివీధిలో బుధవారం జరగనున్న ఓ వివాహం కోసం మంగళవారం వచ్చారు. సాయంత్రం వంశధార కుడి కాలువలో స్నానానికి దిగి ప్రవాహంలో మునిగిపోయాడు. ఆయనతో పాటు ఉన్న ఇద్దరు వ్యక్తులు కాపాడడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎంత గాలించినా ఆయన ఆచూకీ దొరకలేదు. హిరమండలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు శుభకార్యానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్న కుటుంబం విషాదంలో మునిగిపోయింది. బాలకృష్ణకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రేమించి మోసం చేశాడు

- విజయవాడ యువతి ఆందోళన



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న క్రిష్టినా ఏంజెల్

శ్రీకాకుళం క్రైమ్: సంతబొమ్మాళి మండలం పిట్టవానిపేటకు చెందిన యువకుడు తనను ప్రేమించానని చెప్పి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని విజయవాడకు చెందిన ప్రత్తిపాటి క్రిష్టినా ఏంజిల్ ఆరోపించారు. ఆమె మంగళవారం శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. పిట్టవానిపేటకు చెందిన శాంతికుమార్, తన సోదరుడు రూఫిన్ బెంగళూరులో బైబిల్ కాలేజీలో శిక్షణ తీసుకున్నారని, ఆ సమయంలోనే తనతో శాంతికుమార్ పరిచయం పెంచుకున్నాడని తెలిపారు. ఆ తర్వాత శాంతికుమార్ తన ప్రేమను వ్యక్తం చేశాడని, తన కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించాడని చెప్పారు. తాను కూడా పెళ్లికి ఒప్పుకున్నానని, ఆ తర్వాత శారీరకంగా కూడా ఇద్దరం ఒక్కటయ్యామని తెలిపారు. ఏప్రిల్‌లో అతను తనకు రింగు కూడా తొడిగాడని, ఆ తర్వాత ముఖం చాటేశాడని, ఏప్రిల్ 28 నుంచి కుటుంబ సభ్యులంతా తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశారని పేర్కొన్నారు. వేరే సంబంధం కుదరడంతో తనను వదిలేశారని, దీంతో జూన్‌లో శాంతి కుమార్ ఇంటికి వెళ్లి మరీ బతిమలాడానని, అయినా ఒప్పుకోకపోవడంతో విజయవాడ దిశ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అప్పట్లో పలాస తెలుగుదేశం పార్టీ నాయకుడు, అచ్చెన్నాయుడు అనుచరుడు బోసుబాబుతో తనను బెదిరించారన్నారు. ఈ విషయంపై బోసుబాబుతో పాటు శాంతికుమార్ ఆయన తండ్రిపై కూడా తాను విజయవాడ పడమట స్టేషన్‌లో కేసు పెట్టానని చెప్పారు. రెండు కేసులు పెట్టడంతో శాంతికుమార్ కుటుంబ సభ్యులు తనపై సంతబొమ్మాళి పీఎస్‌లో కేసు పెట్టారని, టెక్కలి డీఎస్పీ విచారణకు రావాలంటే సోమవారం విచారణకు హాజరై తన వద్ద ఉన్న ఆధారాలు అన్నీ సమర్పించానని చెప్పారు. శాంతికుమార్ తనను పెళ్లి చేసుకునే వరకు వదిలి పెట్టబోనని, అతని ఇంటి ముందు మౌన పోరాటం చేస్తానని తెలిపారు. పోలీసు అధికారులు సహకరించి తనకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

క్రీడాకారులు దేశానికే గర్వకారణం

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



క్రీడాజ్యోతితో ర్యాలీలో నడుస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం అర్బన్: ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు విజయాలు సాధించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, సెట్ శ్రీ ఆధ్వర్యంలో స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద జాతీయ క్రీడా దినోత్సవాలు మంగళవారం జరిగాయి. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా జ్యోతిని వెలిగించి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. స్టేడియంలో ఏర్పాటుచేసిన బాక్సింగ్, తైక్వాండో, వెయిట్ లిఫ్టింగ్ క్రీడలను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి దేశానికి గర్వకారణం కావాలని అన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలికవసతులు, సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా క్రీడల్లో విశేష కృషి చేసిన జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తిను సత్కరించారు. సెట్ శ్రీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బీవీ ప్రసాదరావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమాన్ని అక్టోబర్ 2 నుండి నవంబర్ 2 వరకు నిర్వహిస్తోందని అన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖో-ఖో మరియు కబడ్డీ పోటీలు ఇందులో ఉంటాయని, గ్రామ- వార్డు సచివాలయాలు, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నగదు బహుమతిని అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా చీఫ్ కోచ్ డాక్టర్ శ్రీధర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, నెహ్రూ యువ కేంద్ర అకౌంట్స్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవి రమణ, అర్జున్‌రావ్‌రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, పీడీ లు, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.